# దాసన్న మూట

ఉన్నవ
మదనమోహనరావు



అదిగో, అదే దాసన్న మూట! అతడే దానికి యజమాని. ఆ మూట దాసన్నకు ప్రాణం. దాసన్న మూట పేరు వింటే చాలు — ఆ ఊళ్ళో ఆరు రోజుల ముసలిదైనా సరే, కిక్కురుమనకుండా పాలుతాగుతాడు. ఇంతకీ ఆ మూటలో ఏముందో ఎవరికీ తెలియదు. బహుశా దాసన్న కూడా మరిచిపోయి ఉంటాడు, అందులో ఏం పెట్టిందీను. కారణం దాసన్న ఎప్పుడూ ఆ మూట విప్పిన పాపాన పోలేదు. అది ఆ నాటి మూట కాదు. ఏళ్ళ నాటి మూట. దాసన్న దాని విడిచి ఉండగా ఈ ఎల్లి ఎప్పుడూ లేదా ఎవరూ చూడలేదు. పగలు, రాత్రి, ఎండలో, వానలో—ఎక్కడున్నా అది దగ్గర ఉండాల్సిందే. దాసన్న దాన్ని ప్రాణంగా గుండెకు అదుముకొని మరీ నడుస్తాడు.

'అసలు దాసన్న ఎవరు అడుగుతారేమో? ఊరు వేలుగా గుర్తు పట్టే తప్ప. ఆ ఊళ్ళో మూట గుండెలు పొదువుకొని తిరిగే పిచ్చి దాసన్న. మూట లేకపోతే దాసన్న కాదన్న మాట.

ఆ మూటలో ఏముందో చూడటానికి కొందరు గడుగ్గాయిలు ప్రయత్నించి పోయారు. కొంతమందికి డబ్బో, బంగారమో దాసన్న దా

పెట్టుకొన్నాడని అనుమానం. అయినా, ఆ మూటలో ఏముందో ఎవరూ తెలుసుకోలేకపోయారు, ఆ ఏళ్ళ సంవత్సరాలలోనూ. అదొక రహస్యం.

• • •


ముడతలు పడిన చర్మం, తైల సంస్కారం లేక జడలు కట్టిన జుత్తు, ఏదో ధ్యానంలో నిమగ్నమైనట్లు కనిపించే లోతుకు పీక్కుపోయిన కళ్ళు. శిరాలు కనిపిస్తూ, అస్థిపంజరం నడిచి వస్తున్నదా అని స్ఫురింపజేసే ఆమూర్తి దాసన్నదే. రెండు చేతులతో మూటను హృదయానికి హత్తుకొని, తనలో తాను ఏదో సణుగుతూ, తెల్లవారు జామునే గబగబ వచ్చి కాలువ గట్టున ఉన్న రావిచెట్టు క్రింద కూర్చుంటాడు దాసన్న. సుళ్ళు తిరుగుతూ ప్రవహించే కాలువ వైపు చూస్తూ చూస్తూ ఎంత కాలం గడుపుతాడో ఎవరికీ తెలియదు. రాత్రి బాగా ప్రొద్దుపోయిన తరువాత నిదురలేక నిదురలేక, మాటిమాటికీ మెలకువ తిరిగి మూసుకుంటూ, బాధతో దీర్ఘ నిశ్వాసం విడిచి అతి కష్టం మీద గుడిసె చేరుకుంటాడు. ఇదే దాసన్న దినచర్య. ఏళ్ళ ఏళ్ళుగా ఈ దినచర్యలో మార్పు లేదు.

వేసవిలో వడగాలులు ఉధృతంగా వీచినా, వర్షాకాలంలో ముసురు పట్టి పెను తుఫానులు వచ్చినా, దాసన్న చలించ లేదు. మంచినీళ్ళకోసం కాలువకు వచ్చే స్త్రీలు జాలి తలచి ఏదైనా ఆహారం తెస్తే తినేవాడు. లేకపోతే అదీ లేదు. అసలు దాసన్నకు ఆకలి దప్పులు లేవని చాలామంది అభిప్రాయం.

దాసన్నను గురించి ఆ ఊరి వారికి పలు రకాల అభిప్రాయాలు ఉన్నాయి. దాసన్న పిచ్చివాడని చాలామంది అభిప్రాయం. కాదు. పూర్వజన్మలో అతనొక గొప్ప యోగి అని, విధివశాత్తూ తపోభ్రష్టుడై హరిజనుడుగా పునర్జన్మ ఎత్తాడని కొందరి నమ్మకం. మరి కొందరికి 'పిచ్చీ లేదు, గిచ్చీ లేదు. ఇదొక వేషం' అనే అభిప్రాయమూ లేక పోలేదు. అయినా, దాసన్నకు ఊరివారి అభిప్రాయాలతో పని లేదు.

• • •

దాసన్న ఏ ఇంటికీ వెళ్ళడు, ఒక్క జమీందారు గారి ఇంటికి తప్ప. అది కూడా సంవత్సరానికి ఒక్కసారి. దీపావళికి మాత్రమే. ఆ రోజు జమీందారు గారి ఇంటి నుండి పిలుపు వస్తుంది దాసన్న కోసం. దాసన్న హుందాగా మూట పట్టుకొని వెళతాడు. జమీందారు గారి



జ్ఞాన ప్రభ ఫొటో—ఎస్. పరిపూర్ణచంద్ (హైదరాబాదు)

ఇంట్లో దాసన్నకు అభ్యంగన స్నానం చేయిస్తారు. జమీందారు కొత్త ధోవతులు పెడతారు. కొత్త ధోవతి కట్టుకొని, పాతది భద్రంగా మూటకు చుట్టి ముడి వేసుకుంటాడు దాసన్న. పిండివంటలతో భోజనం చేసి రావిచెట్టు క్రింద కూర్చుంటాడు.

ముసలి జమీందారు కాలంలోనే ఇది పాటింపు మొదలైపోయింది. ఆయన పెద్దకూతురు మహాలక్ష్మి చనిపోయి నప్పటినుంచి ఇది జరుగుతున్నది అని ఊళ్ళో చాలా మంది అంటుంటారు. మహాలక్ష్మి చావును గురించి కూడా చాలా కథలు ప్రచారంలో ఉన్నాయి. ఆమె ఆత్మహత్య చేసుకున్నదని, కాదు హత్య చేయబడిందని రకరకాలుగా చెప్పుకునేవారు లోకులు. అయినా, జమీందారు గారి గృహ విషయం బయట చాలా మందికి ఏమీ తెలియదు.

అయినా, ముసలి జమీందారు జీవించి ఉన్నంతకాలం దాసన్నకు మంచి ధోవతులు పెట్టేవాడు. ఆయన చనిపోయేముందు కొడుకుని మరీ మరీ కోరాడు, దాసన్నకు ఏటా దీపావళికి ధోవతులు పెట్టమని.

జమీందారీ పోయినా, తండ్రి కోరికను చెల్లిస్తూనే ఉన్నాడు కొడుకు. అయితే, కాలం గడిచినకొద్దీ ధోవతుల చాపు లుంగీ, తుండుగుడ్డలుగా మారింది. అభ్యంగన స్నానం నామాల స్నానం అయింది. కాని, ఆచారం మారలేదు. ఏళ్ళ సంవత్సరాలుగా దాసన్నకు జమీందారు గారి ఇంటి మర్యాదలు జరుగుతూనే ఉన్నాయి.

• • •

దాసన్న తండ్రి తాతలు జమీందారు గారి ఇంట్లో పాలేరులు. వాళ్ళ జీవితాలన్నీ జమీందారుగారి కుటుంబ సేవకే అంకితం చేశారు. ఆ మాటకొస్తే, దాసన్న కూడా ఇరవయ్యో ఏడు వచ్చే దాకా జమీందారు గారి ఇంట్లోనే పనిపాటలు చేస్తుండే వాడు.

ముసలి జమీందారు కూతుర్కీ, పాలేరు యువకునికీ ప్రేమానురాగాల గురించి ముసలి తరం వాళ్ళు కథలు కథలుగా చెప్తూ ఉంటారు.

• • •

చివరకు ఒక రోజున క్రమం తప్పని దాసన్న దినచర్యకు అంతరాయం కలిగింది. క్రితం రోజు రాత్రి ఇంటికి వెళ్ళని దాసన్న రావిచెట్టు క్రిందనే స్పృహ తప్పి పడి ఉన్నాడు. మొట్ట మొదటి సారిగా దాసన్నకోసం వెతికారు.

ఈ సంగతి తెలిసిన జనం చెట్టు కింద గుమిగూడారు. కొందరు దాసన్న మంచి తనాన్ని తలచుకున్నారు. మరికొందరు అర్థశతాబ్దం పాటు సాగిన దాసన్న దినచర్యను గురించి చెప్పుకున్నారు. ఇంకా కొందరు దాసన్న మూటను గురించి చెప్పుకున్నారు.

కాని, దాసన్న మాత్రం బ్రతికి ఉన్నప్పుడు ఏ విధంగా ఊరి వాళ్ళ అభిప్రాయాలను పట్టించుకోలేదో, ఇప్పుడూ అలాగే నిశ్చింతగా మూటను గుండెలకు అదుముకొని పడుకున్నాడు.

• • •

"అసలు ఆ మూటలో ఏం దాచుకున్నాడో?" కుతూహలం రేకెత్తింది కొందరికి.

"విప్పి చూస్తే సరి!" అన్నారు కొందరు ఉత్సాహవంతులు.

"ఛీ! వాడి మూట మనకెందుకు? ఆ మూటనుకూడా వాడితోపాటే సమాధి చేయండి" అన్నాడొక వృద్ధుడు.

కాని, అంతమంది జనంలో వృద్ధుడి సలహా నచ్చలేదు ఎవరికీ.

ఆ మూటలో ఏముందో చూడాలనే కోరిక ఎక్కువ కాసాగింది జనంలో.

దాసన్న జీవించివున్నప్పుడు చేయలేని పని ఇప్పుడు చేయటానికి పూనుకున్నారు కొందరు.

దాసన్న మరణించాడని తెలిసికూడా మూట విప్పేసే ముందు అందరి కళ్ళూ దాసన్న వైపు చూశాయి, దాసన్న లేచి వస్తాడేమోననే భయంతో.

ఆత్రంగా మూట విప్పదీయసాగారు జనం. ఒక ముడి విప్పదీయగానే ఇంకొక ముడి, తరువాత ఇంకొకటి, అది తీయగానే మరొకటి ... వందల కొద్దీ ముళ్ళు ఉడదీశారు, ఆత్రంగా. మూట మరీ చిన్నదయిపోయింది. ఇంక ఒక్కటే ముడి మిగిలింది. జనంలో కుతూహలం. చూద్దామనే ఉత్సాహం.

"ఒరేయ్! వాడి మూటలో ఏముంది? ముందు వాడి అంత్యక్రియల సంగతి చూడండి!" అని అంటున్న వృద్ధుడి మాటలు ఎవరూ వినిపించుకునే స్థితిలో లేరు.

చివరి ముడి కూడా విప్పారు... జనం ఒక్కసారిగా ముందుకి వంగారు చూడ్డానికి ... ఏముంది అందులో? ఎవరిదో ఫొటో! పాస్‌పోర్టు సైజులో ఉన్నది. ఆ ఫోటో పదహారేళ్ళ అందమయిన అమ్మాయి ... ఆ అమ్మాయి ఎవరో? మూట విప్పిన యువకులకు అర్థం కాలేదు.

చివరికి చేతులు మారుతూ వృద్ధుడి దగ్గరికి వచ్చింది ఫొటో.

"తాతా! ఈ ఫొటో ఎవరిదో నీవు చెప్పగలవా?" అడిగిం దొక కంఠం జనంలోంచి.

తాత ఫొటో చేతికి తీసుకొని తదేకంగా చూశాడు. ఏళ్ళ ఏళ్ళ క్రితం పాలేరు కొడుకుని మనసారా ప్రేమించిన జమీందారు గారి పెద్దకూతురు మహాలక్ష్మి ఫొటో చూసి ఆ వృద్ధుడి కళ్ళ నుండి రెండు అశ్రుబిందువులు రాలి చేతిలో ఉన్న ఫొటో మీద పడ్డాయి. ★